క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూర్యాపేట అర్బన్ : విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని గిరినగర్, హనుమాన్ నగర్, దాసాయిగూడెం రోడ్డు, ఈనాడు ఆఫీస్, హోటల్ రితిక ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం 01:00 నుంచి 03:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పట్టణ వన్ టౌన్ ఇంజనీర్ ఆర్.సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాటర్ కూలర్ బహూకరణ

తుంగతుర్తి : కోర్టుకు వాటర్ కూలర్‌ను అందజేయడం అభినందనీయమని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎండీ గౌస్ పాషా అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్ సోమవారం కోర్టుకు అందించిన వాటర్ కూలర్‌ను ప్రారంభించి మాట్లాడారు. కోర్టుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే న్యాయవాదులు, కక్షిదారుల దాహార్తిని తీర్చడానికి వాటర్ కూలర్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు జడ్జి ఎండీ గౌస్ పాషాను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వర్లు, రణధీర్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

నాగారం : రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కన్నెబోయిన లింగయ్య, ఉపాధ్యక్షుడిగా ఎర్ర పుష్పాంజలి, కార్యదర్శిగా గుండగాని వినిత, కార్యవర్గ సభ్యులుగా శైలజ, మాధవి, నాగమల్లయ్య, నరేష్, సూరయ్య, సత్యనారాయణ, రజిత, దేవకమ్మ, లక్ష్మి, మట్టమ్మ, లింగారెడ్డి, యాకలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 16 గ్రామాల రేషన్ డీలర్లు నూతన కమిటీ పత్రాన్ని తహసీల్దార్ హరికిషోర్ శర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పనులకు శంకుస్థాపన

నాగారం : మండల పరిధిలోని పస్తాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులకు సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలకు ఇళ్లు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండగొర్ల కుమారస్వామి, నాయకులు వల్లకొండ వెంకన్న, పోగుల విక్రమ్, జలగం అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా సందీప్

నాగారం : ఈటూరు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా వంగూరి సందీప్, గౌరవ అధ్యక్షుడిగా పేరాల సోమయ్య, ఉపాధ్యక్షుడిగా పోలేపాక అంజి, ప్రధాన కార్యదర్శిగా పేరాల వెంకటేష్, కోశాధికారిగా వంగూరి శశికుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా పేరాల గౌతమ్, క్రీడల కార్యదర్శిగా బోడ లోకేష్, కార్యవర్గ సభ్యుడిగా వంగూరి శివతోపాటు మరికొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పేరాల కృష్ణకుమార్, పేరాల వెంకటేష్, నాగిళ్ల కాశీం, వంగూరి అనిల్, ఎల్లి సైదులు, బోడ నరేష్, ఎల్లి అనిల్ పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారికి ఆహ్వానం

అర్వపల్లి : కొమ్మాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 20న జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో నిర్వాహకులు డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానంద చారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరారపు సైదులు, సుదర్శన్, గంగదేరి శ్రీనివాస్, నర్ర సురేష్, బుచ్చిరాములు, శ్రీను, వెంకటయ్య, వీరమల్లు, ముత్తయ్య, అయోధ్య, మల్లయ్య, వెంకన్న, పెద్దులు, ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఇళ్ల పంపిణీ

మద్దిరాల : ఉన్నతాధికారుల ఆదేశానుసారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేస్తామని తహసీల్దార్ అయేషా పర్వీన్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం పలువురు గ్రామస్తులు మండల కేంద్రంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఆక్రమించుకోగా తహసీల్దార్ అయేషా పర్వీన్, ఎంపీడీఓ సత్యనారాయణ రెడ్డి, స్థానిక పోలీసులు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. త్వరలోనే లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు పంపిణీ చేస్తామని, ఎవరూ ఇళ్లను ఆక్రమించవద్దని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్థూపం నిర్మాణానికి సహకరించాలి

తిరుమలగిరి : తిరుమలగిరిలో పొట్ల రామనర్సయ్య స్థూపం నిర్మాణానికి సహకరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. సోమవారం స్థూపం నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవంబర్ 3వ తేదీన రామనర్సయ్య 49వ వర్ధంతి సందర్భంగా స్థూపం ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి పేర్ల నాగన్న, ఎర్ర అఖిల్, కొత్తపల్లి రేణుక, కొండన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫొటోలు దిగితేనే ‘ఉపాధి’ వేతనం

- ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేలా కొత్త విధానం
- ఎన్ఎంఎంఎస్ పేరుతో ప్రత్యేక యాప్‌ను తెచ్చిన కేంద్రం


లింగాలలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ(ఫైల్)

పెన్‌పహాడ్ : ఉపాధి హామీ పథకంలో అవినీతికి ఆస్కారం లేకుండా జవాబుదారీతనం పెంచేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. ఉపాధి పథకం నిబంధనలు కఠినతరం చేసింది. వలసలను అరికట్టి సొంత గ్రామాల్లోనే కూలీలకు పనులు కల్పించాలన్న లక్ష్యంతో 2006లో నాటి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏటా పనులను గుర్తించి కూలీకు ఉపాధి చూపుతున్నారు. పలుచోట్ల కూలీల హాజరుతోపాటు మస్టర్ల నమోదులో అవినీతి జరుగుతుందని సోషల్ ఆడిటర్లు, తనిఖీ బృందాలు గుర్తిస్తున్నాయి. అయినా అవినీతి తగ్గకపోవడంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కూలీల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసేలా ఇటీవల కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది.

రెండు పూటలా ఫొటోలు..

పని ప్రదేశంలో రెండు పూటలా కూలీల ఫొటోలు తీయాల్సిందేనని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఒక్క పూట పనిచేస్తే వారికి అంత వరకు కూలీ వచ్చేటట్లు యాప్‌ను ఏర్పాటు చేశారు. పని ప్రదేశాల్లో తీసిన ఫొటోలను ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా పనుల కల్పనకు సంబంధించి గుర్తించిన పని ప్రదేశాన్ని ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అక్కడ హాజరైన కూలీలు ఆ పని ప్రదేశంలో పనులు చేస్తున్న ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తేనే మస్టర్ పడుతుంది. బయటకు వచ్చిన తరువాత ఫొటో తీస్తే యాప్ తీసుకోదు.

పర్యవేక్షణకు అధికారులు

పని ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తీసిన ఫొటోలను గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీఓ, ఎంపీడీఓ, జిల్లా అధికారులతో పాటు రాష్ట్రస్థాయిలో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వరకు ర్యాండమ్‌గా ప్రతిరోజూ పర్యవేక్షిస్తారు. పాత ఫొటోలను అప్‌లోడ్ చేస్తే వెంటనే దొరికిపోయేలా యాప్‌ను రూపకల్పన చేశారు. కొత్త నిబంధనలతో మస్టర్ల నమోదు ప్రక్రియ పకడ్బందీగా ఉంటుందన్న చర్చ జరుగుతుండగా, మరోవైపు పని ప్రదేశాల్లో రెండు పూటలా ఫొటోల అప్‌లోడ్ విధానం సిబ్బందికి పరీక్షగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పకడ్బందీగా పనులు



ఇకనుంచి ఉపాధి పనులు పకడ్బందీగా జరుగుతాయి. బోగస్ మస్టర్లకు చెక్ పెట్టే విధంగా కొత్త యాప్‌ను కేంద్రం రూపొందించింది. పని ప్రదేశానికి వెళ్లి ఫొటో తీస్తేనే అప్‌లోడ్ ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో శ్రమకు తగిన వేతనం కూలీలకు లభిస్తుంది.

– రవి ఏపీఓ, పెన్‌పహాడ్

ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

భానుపురి : జిల్లాలో కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితా ప్రక్రియ, పోలింగ్ కేంద్రంలో 1200 ఓట్లు దాటితే కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్ల ఏర్పాటుపై సమీక్షించారు. కొత్తగా 27 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటవుతున్నందున దీనికి సంబంధించి వివరాలపై చర్చించారు. సమావేశంలో చకిలం రాజేశ్వర్‌రావు, నవరాల సత్యనారాయణ, హబీద్, డేగల రమేష్, స్టాలిన్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి..

బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీల్లో బాలికల క్లబ్‌లు ఏర్పాటు చేసి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా సోమవారం ఉపాధ్యాయుల హాజరు శాతం 78 శాతం మాత్రమే ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం అత్యధికంగా క్యాజువల్ లీవ్స్ ఉపయోగించిన వారి వివరాలు, అనాథరైజ్డ్ గైర్హాజరు, దీర్ఘకాలిక సెలవుపై ఉన్న ఉపాధ్యాయుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ అశోక్, కోఆర్డినేటర్లు జనార్దన్, శ్రవణ్‌కుమార్, రాంబాబు, పూలమ్మ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత లేకుండా వైద్యం చేస్తే చర్యలు తప్పవు..

అర్హత లేకున్నా వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వారిపై, అనధికారిక అబార్షన్లు చేస్తూ గర్భిణుల మరణాలకు కారణమవుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ చంద్రశేఖర్, డీపీఓ యాదగిరి, డీఆర్‌డీఓ అప్పారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ జయ మనోరి, చంద్రశేఖర్, కోటిరత్నం, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

బంజారా సంస్కృతికి ప్రతీక ‘తీజ్’


తీజ్ వేడుకల్లో పాల్గొని నృత్యం చేస్తున్న గిరిజన యువతులు, మహిళలు

భానుపురి : బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ అని మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 16వ వార్డు తిరుమలనగర్ బేచిరాగ్ మాదారం ముత్యాలమ్మ ఆలయం వద్ద గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కనుమరుగవుతున్న బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు జీవం పోసేలా తీజ్ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లూనావత్ పాండు నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారావత్ వీరన్న నాయక్, జిల్లా అధ్యక్షుడు గుగులోతు నాగు నాయక్, తీజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ జాటోతు రాజేష్ నాయక్, అజయ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

పెన్‌పహాడ్ : సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద్యాల వినోద్, నల్ల శ్రీనివాసు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శివశంకర్, అల్లాడి సత్యనారాయణ, సంద సైదిరెడ్డి పాల్గొన్నారు.

తిరుమలగిరి : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని తిరుమలగిరిలో పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దామెర శ్రీనివాస్, కసిరెడ్డి అశోక్ రెడ్డి, కె.ఉపేంద్ర, వెంకట్‌రామనర్సయ్య, ఆసిఫ్‌అలీ, సత్తిరెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరపాలి


మాట్లాడుతున్న సీఐ నాగేశ్వర్‌రావు

తిరుమలగిరి : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నాగారం సీఐ నాగేశ్వర్‌రావు అన్నారు. తిరుమలగిరి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తిరుమలగిరిలోని ఆర్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన గణేష్ ఉత్సవాల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గణేష్ మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని తెలిపారు. నిర్వాహకులు పోలీసుల అనుమతి పొందాలన్నారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం పూర్తయ్యేంత వరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహమ్మద్, శానిటరీ సెక్రటరీ వార్డ్ ఆఫీసర్ పంగా శోభ, మండల విద్యుత్ అధికారి సంపత్ రమేష్, కందుకూరు అంబేద్కర్, వివిధ గ్రామాలకు చెందిన వినాయక ఉత్సవాల నిర్వాహకులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలోనూ ఉద్యమకారులకు అన్యాయం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని భావిస్తే చివరికి అన్యాయమే జరిగిందని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర మహిళా వింగ్ అధ్యక్షురాలు కోతి మాధవిరెడ్డి, తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండాల సందీప్‌యాదవ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో రైతు మార్కెట్ అంబేద్కర్ విగ్రహం వద్ద సెప్టెంబర్ 12న ఇందిరా పార్కు వద్ద జరిగే టీయూ జేఏసీ మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల దగ్గరికి వెళ్లినా ఇంతవరకు ఉద్యమకారులను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహాధర్నా తర్వాత తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీయూ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి మురళి, నాయకులు మల్లయ్యయాదవ్, వీరబోయిన రవి యాదవ్, మల్లయ్యయాదవ్, సంతోష, కమలమ్మ, గణేష్, రాజు, సుధాకర్, చంద్ర రామ్మూర్తి, శ్రీనివాస్, రాఘవులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సహకారం అభినందనీయం


మాట్లాడుతున్న డీఐఈఓ భానునాయక్

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమని డీఐఈఓ భాను నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సోమవారం కళాశాల పూర్వవిద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సూర్యనారాయణ, ప్రొఫెసర్ విశ్వ మోహన, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఉప్పునూతల మహేందర్ రెడ్డి, మాజీ ఫిజికల్ డైరెక్టర్ పటేల్ నరసింహారెడ్డి, విద్యాసాగర్, రుద్రంగి సత్యనారాయణ, సుధా బ్యాంకు ఎండీ పెద్దిరెడ్డి గణేష్, రామదాస్, ప్రిన్సిపాల్ యాదయ్య, వలిశెట్టి సత్యనారాయణ, చంద్రశేఖర్, వేణుధర్ పాల్గొన్నారు.

వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అర్వపల్లి : కోడూరు వాగును పరిశీలిస్తున్న ఆర్డీఓ


అర్వపల్లిలో ఇళ్ల ఎదుట నిలిచిన వర్షపు నీరు

అర్వపల్లి : భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ వేణుమాధవరావు కోరారు. సోమవారం తిమ్మాపురం–సంగెం రహదారిపై ప్రవహిస్తున్న వాగును మండల అధికారులతో కలిసి పరిశీలించారు. వాగు ప్రవహిస్తున్నందున ఈ రహదారిపై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, ఏఈలు కుమారస్వామి, హరి స్వరూప్, ఎస్ఐ ఈట సైదులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

తొండ గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లను సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు సోమవారం పరిశీలించారు. వలిగొండ, తొర్రూరు హైవేపై జరుగుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, ఆర్ఐ జార్జిరెడ్డి, కార్యదర్శి యాకూబ్‌రెడ్డి పాల్గొన్నారు.

అగని వర్షం.. అంతా అతలాకుతలం

అర్వపల్లి : వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వరి, పత్తి చేలన్నీ నీట మునిగాయి. తాటిపాముల, నందాపురం, అనంతారం గ్రామాల గుండా వెళ్తున్న బిక్కేరు వాగు వరద ఉధృతి పెరిగింది.


తిరుమలగిరి : అనంతారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు

ఘనంగా సర్దార్ పాపన్నగౌడ్ జయంతి వేడుకలు


భానుపురి : సర్దార్ పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, నాయకులు


సూర్యాపేటటౌన్ : పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు


పెన్‌పహాడ్‌లో పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు


మద్దిరాల : పోలుమల్లలో పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు


తిరుమలగిరిలో సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

భానుపురి : ప్రతి ఒక్కరూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వాయి పాపన్న జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, బీసీ సంక్షేమాధికారి శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి దయానంద రాణి, డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, డీఈఓ అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సీపీఓ కిషన్, డీఎఫ్ఓ సతీష్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్ : ఎస్పీ కార్యాలయంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ నరసింహ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, డీఎస్పీ నరసింహ చారి, ఆర్ఐ మంజుభార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : బహుజన రాజ్య స్థాపకుడు సర్వాయి పాపన్న జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తిరుమలగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిలకత్తుల రామ్మూర్తి గౌడ్, రామచంద్రు గౌడ్, వీరమల్లు, వీరన్న, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడ సంఘం నాయకులు అన్నారు. సోమవారం పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే కొత్తగూడెం గ్రామంలో సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గుండగాని రాములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పులుసు యాదగిరి, తునికి సాయిలు, గుండగాని దుర్గయ్య, గడ్డం ఉప్పలయ్య, గుండగాని శ్రీనివాస్, కట్ల మల్లయ్య, తొట్ల సుధాకర్ పాల్గొన్నారు.

భారతదేశ మరో శివాజీ సర్వాయి పాపన్న

మొగల్ చక్రవర్తులను ఓడించి గోల్కొండ కోటను ఏలిన యోధుడు, భారతదేశ మరో శివాజీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. సోమవారం సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా మండల కేంద్రంలో పాపన్న విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, తిరుమలప్రగడ కిషన్‌రావు, ఉప్పుల రాంబాబుయాదవ్, పెద్దబోయిన అజయ్ పాల్గొన్నారు.


నాగారం : ఈటూరులో పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

పెన్‌పహాడ్ : సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో నిర్వహించిన పాపన్న జయంతి ఉత్సవాల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పొడిశెట్టి సైదులు, బోడ పరశురాములు, బోడ సైదులు పాల్గొన్నారు.

అర్వపల్లి : పాపన్నగౌడ్ జయంతి వేడుకలను సోమవారం జాజిరెడ్డిగూడెంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ టి.గోపి ఆధ్వర్యంలో జరిపారు.

నాగారం : బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాపన్న విగ్రహ కమిటీ కార్య నిర్వాహకుడు గొడిశాల వీరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఈటూరులో పాపన్న విగ్రహ కమిటీ, గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాపన్న విగ్రహ కమిటీ సభ్యులు మొగుళ్ల రమేష్‌గౌడ్, మొగుళ్ల రామకృష్ణగౌడ్, బండి యాకయ్య పాల్గొన్నారు. మామిడిపల్లిలో జరిగిన వేడుకల్లో మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కనుక ఉమారాణి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉత్సవాలను నిర్వహించారు.


తుంగతుర్తిలో పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో వేడుకల్లో పాల్గొన్న గౌడ కులస్తులు

సమస్య పరిష్కరించాలని వినతి

నాగారం : మండల పరిధిలోని నర్సింహులగూడెంలో తలెత్తిన తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పలువురు గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి డి.సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామానికి వచ్చే తాగునీటి బోరు చెరువు ఆవరణలో ఉందని, ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి బోరులోకి మురుగు నీరు చేరి కలుషితమైనట్లు తెలిపారు. తాగునీరు కలుషితం కావడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి ఏడాది చెరువు నిండితే ఇదే పరిస్థితి ఎదురవుతుందని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పొర్ల పెద్దిరాజు, పొర్ల మల్లేష్, చెన్నబోయిన సైదులు, చారి, రవీందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

అర్వపల్లి : ఉయ్యాలవాడ గ్రామంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో సోమవారం హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల రాంబాబు, పాశం భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.